

పోదామా భామ్రాఘడ్..!
కుమురంభీం జిల్లా సరిహద్దులోని భామ్రాఘడ్ పర్యటకులను ఆకట్టుకుంటోంది. మహారాష్ట్రలోని అహేరి, ఆళ్లపెల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. 8లో▸



భూ పరీక్షల జాడేది?
జిల్లాలో మూడేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. 70 రైతువేదికల్లో ఏర్పాటు చేసిన మినీ ల్యాబ్‌లు నిరుపయోగంగా మారాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.2 /28.4
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం తర్వాత ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది.

రావుగారి అడ్డా..!



ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- పుష్కర కాలంగా ఒకేచోట మకాం
- అర్జనలో అవినీతి లీలలు ఎన్నో..
- ముడుపు లేకుంటే డాక్యుమెంట్ ముట్టుకోరు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఇష్టారాజ్యం

సాక్షి, ఆసిఫాబాద్: చంటిగాడు లోకల్.. అన్నట్లుగా ఓ అధికారి ఆసిఫాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తన అడ్డాగా మార్చుకున్న వైనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆశీస్సులతో దాదాపు 13 ఏళ్లుగా ఇక్కడే మకాం వేయడమే కాకుండా ప్రత్యేకంగా కొందరు దళారులను పెట్టుకుని భారీగా అర్జిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటున్నాయి. అయితే ఆ కేంద్రంలో కొలువుదీరిన అధికారి ముడుపు లేకుంటే.. డాక్యుమెంట్ ముట్టుకోకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అన్ని పనులూ దళారులతోనే..
ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ వ్యక్తి హడావుడిగా తిరుగుతుంటారు. అతను ఉద్యోగి కాదు.. దళారీ. అతని అనధికార పనేమిటంటే.. ఆ రోజు ఎన్ని డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయి. వాటి విలువ ఎంత? వాటిలో అధికారికి ఇచ్చే కమీషన్ విలువ ఎంత? అంత సొమ్ము డాక్యుమెంటు రైటర్లు, ఆస్తుల క్రయవిక్రయదారుల నుంచి వసూలు చేయడం.. రాత్రికి ఆ సొమ్మును సదరు అధికారికి అప్పచెప్పడం.. అతని దినచర్య. సాధారణంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒక శాతం సొమ్ము లంచంగా ముట్టచెప్పడం ఆనవాయితీ. కానీ ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మాత్రం ఇందుకు భిన్నం. ఇక్కడ అధికారికి అనుకూలంగా ఉన్న దళారుల ద్వారా వెళ్లి, వారు అడిగిన విధంగా కమీషన్లు ముట్టచెబితే ఎలాంటి వివాదాలున్నా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఏ మాత్రం లిటిగేషన్ ఉన్నా.. అత్యధిక సొమ్ము డిమాండ్ చేస్తున్నారు. సాధారణంగా లావాదేవీలు, విలువను బట్టి సబ్ రిజిస్ట్రారుకు ఒక శాతం నుంచి 2 శాతం సమర్పించుకుంటారనేది బహిరంగ రహస్యం. ఆసిఫాబాద్‌లో ఈ వ్యవహారం ఓ డాక్యుమెంట్ రైటర్ నడిపిస్తున్నారు. కార్యాలయం మొత్తం ఆయన చేతుల్లోనే నడుస్తుందని సమాచారం. ఇక్కడ కమీషన్ల రూపంలోనే నెలకు రూ.25 లక్షలు వస్తుందని అంచనా. దీని కోసమే ఇక్కడ రావుగారు మకాం వేశారని ఆ శాఖ ఉద్యోగులు అంటున్నారు. 10 కిందట ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారతి ట్రేడర్స్ ఎదురుగా ఉన్న 1/70లో ఉన్న 40/60 సైజు ఉన్న ప్లాట్లను చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ పనికి గాను రూ.లక్షలు ముడుపులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. పంచాయతీ అధికారులతో కుమ్మక్కై డీటీసీపీ అనుమతుల్లేకున్నా డోర్ నంబరు ఆధారంగా కొన్ని వందల ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.25వేలు లంచం తీసుకున్నట్లు సమాచారం.

ఏళ్లుగా ఇక్కడే మకాం..
స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల ఆశీస్సులతో ఆసిఫాబాద్‌లో ఆయన పదమూడేళ్లుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మకాం వేసినట్లు తెలుస్తోంది. ప్రతినెలా ఇక్కడ కమీషన్ల(లంచం) ద్వారా వచ్చే సొమ్ములో కొంత రాష్ట్రస్థాయిలో ఉన్న ఓ అధికారికి ఇస్తుండటం వల్లే ఆయన ఒకటి రెండుసార్లు బదిలీపై బయటకు వెళ్లినా మళ్లీ కొన్ని నెలలకే ఇక్కడికి వచ్చారని ఆ శాఖ ఉద్యోగులే చర్చించుకోవడం గమనార్హం. ఆయన విధుల్లో లేకపోయినా ఇతరులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించరు. మరుసటి రోజు తానే వచ్చి డాక్యుమెంట్లపై సంతకాలు చేస్తుంటారు. మంగళవారం సైతం ఆయన సెలవులో ఉన్నారు. కానీ ఎవరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. డాక్యుమెంట్ చివర పేజీలో సబ్ రిజిస్ట్రార్ సంతకం ఖాళీగా ఉంచి రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయనను కట్టడి చేసేవారు లేకపోవడంతో అవినీతికి అడ్డూఅదుపు లేకుండా పోయిందని విమర్శలున్నాయి.

రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 3న రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 70 రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కో రైతు వేదికకు కనీసం 1000 మంది రైతులు వచ్చేలా చూడాలన్నారు. రైతులతో ర్యాలీలు నిర్వహించాలని, రైతుబంధు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు చేపట్టిన సంక్షేమంపై అధికారులు వివరించాలని సూచించారు. అలాగే రైతులతో వారి అభిప్రాయాలు చెప్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల పరిధిలో ఘనంగా నిర్వహించాలి
ఆసిఫాబాద్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు స్థానిక సంస్థల పరిధిలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్లు, జెడ్పీ చైర్‌పర్సన్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఉత్సవాల్లో జెడ్పీ చైర్మన్లు, శాసన సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీసీ, మైనార్టీ సంక్షేమం, దళిత బంధు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, ఇన్‌చార్జి డీపీవో సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

రాజకీయ పార్టీల పాత్ర కీలకం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులు, నాయకులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి రెండో విడత ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 23 వరకు బీఎల్‌వోలు గడపగడపకూ సందర్శించి ఓటరు నమోదు ప్రక్రియ చేపడతారని వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదుకు సహకరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఓటర్లను గుర్తించాలన్నారు. సమీపంలో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో వారి పేరు నమోదు కోసం అవసరమైన దరఖాస్తు సమర్పించేలా నాయకులు కృషి చేయాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెప్టెంబర్‌లో రెండు శనివారాలు, రెండు ఆదివారాలు ఓటరు నమోదు ప్రక్రియ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రమోద్, డీటీ జితేందర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మార్లవాయి అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు

నార్నూర్(ఆసిఫాబాద్): చారిత్రాత్మక గ్రామమైన మార్లవాయి అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో మంగళవారం సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వరావ్‌తో కలిసి పర్యటించారు. గ్రామంలో రూ.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులతోపాటు రూ.20లక్షలతో నిర్మిస్తున్న గుస్సాడీ శిక్షణ కేంద్రం, కాటేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయం, రాజీవి పనులు వేగవంతం చేయాలన్నారు. దశాబ్ది ఉత్సవాల నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మురుగునీటి కాలువలు, కమ్యూనిటీ హాల్ మంజూరుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీల అభివృద్ధి, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్, పాక్స్ చైర్మన్ కొడప హన్ను, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంతీయాజ్ లాల్, నాయకులు మెస్రం అంబాజీ తదితరులు ఉన్నారు.



మార్లవాయిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సక్కు, సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వరావ్

తడిసిన ధాన్యం



దహెగాం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలంలో సోమవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతోపాటు లగ్గాం, ఒడ్డుగూడ, కుంచవెల్లి, గెర్రె, గిరవెల్లి, కల్వాడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. కొనుగోళ్లలో ఆలస్యం కావడంతో తడిసిన ధాన్యంలో మిల్లర్లు కోత విధిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. కాగా అకాల వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



బస్తాల చుట్టూ చేరిన వర్షపు నీరు

ఫలితాల కోసం 'ప్రత్యేకం'

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జూన్ 10 వరకు నిర్వహణ
- గణితం, సైన్స్‌లోనే అత్యధిక మంది ఫెయిల్
- సప్లిమెంటరీలో ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళిక

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక ఫలితాల్లో కుమురంభీం జిల్లా 76.36 ఉత్తీర్ణత శాతంతో రాష్ట్రస్థాయిలో 30వ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. గణితం, సైన్స్‌లో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. ఫలితాలపై కలెక్టర్ హేమంత్ బోర్కడే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. అనుత్తీర్ణులైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షల్లో రాణించేలా ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా విద్యాధికారి అశోక్ అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.



కౌటాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు

'పది'లో ఏటా ఇదే పరిస్థితి..
ఇంటర్మీడియెట్ వార్షిక ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఏటా మంచి ర్యాంకులు సాధిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉండటంతో టాప్ 5లో జిల్లా ఉంటుంది. అదే పదో తరగతి ఫలితాల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాలలకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పరీక్షల్లో రాణించడం లేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 169 ఉన్నత పాఠశాలలకు చెందిన 7,141 మంది ఈ ఏడాది పరీక్షలకు హాజరయ్యారు. డీఈవో పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 56, కేజీబీవీలు 15, ఎయిడెడ్ స్కూళ్లు నాలుగింట్లో మొత్తం 3,065 మంది వార్షిక పరీక్షలు రాశారు. ఇందులో కేవలం 2,131 మంది పాస్ కాగా, ఉత్తీర్ణత శాతం 69.52గా నమోదైంది. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మే 15 నుంచి జూన్ 10 వరకు ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక ప్రణాళికతో తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది గణితం, సైన్స్‌లోనే తప్పిన విషయం తెలిసిందే. దీంతో వారానికి నాలుగు రోజులు ఆయా సబ్జెక్టులపైనే తరగతులు కొనసాగుతున్నాయి. ఇక తక్కువ మంది ఫెయిల్ అయిన తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులను వారానికి రెండుసార్లు బోధిస్తున్నారు.

కారణాలు అనేకం..
జిల్లాలోని సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యార్థులు తరచూ పాఠశాలలకు గైర్హాజరు కావడం పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. అలాగే పరీక్షల్లో గతంలో పదకొండు పేపర్లు ఉండగా, వాటిని విద్యాశాఖ ఆరుకు కుదించింది. ఈ మార్పు కూడా విద్యార్థులు సిద్ధం కాలేదని తెలుస్తోంది. కరోనా సమయంలో రెండేళ్లు ప్రత్యక్ష చదువుకు దూరమైన విద్యార్థులు నేరుగా పదో తరగతిలోకి వచ్చారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించినా నెట్‌వర్క్ సమస్య, పేదరికం వల్ల ఎంతో మంది క్లాసులు వినలేదు. చాలా అంశాలపై కనీస పరిజ్ఞానం లేకుండా పోయింది. పాఠ్యాంశాలు అర్థం కాక మ్యాథ్స్, సైన్స్‌లో ఉత్తీర్ణత సాధించలేదు.

కరోనా ప్రభావం పడింది
రెండు సంవత్సరాల పాటు కరోనా కారణంగా విద్యార్థులు బడులకు రాలేదు. ఏడో తరగతి విద్యార్థి 8, 9 తరగతుల క్లాసులు వినకుండానే పదో తరగతికి వచ్చాడు. ఆయా క్లాసుల్లో అందాల్సిన బేసిక్ జ్ఞానం అందలేదు. ఈ ప్రభావం ఎక్కువగా గణితంపై పడింది. కరోనా కారణంగా చాలా మంది ఉత్తీర్ణులు కాలేదు.
– సంతోష్, మ్యాథ్స్ టీచర్, బూర్గుడ

గైర్హాజరు అయిన వారే అధికం
జిల్లాలో పాఠశాలలకు గైర్హాజరు అయిన వారే ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు. రెండు పేపర్లకు బదులు ఒకే పేపర్ నిర్వహించడం వల్ల కూడా ఉత్తీర్ణత తగ్గింది. విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఎక్కువ మంది పాస్ అయ్యేలా చూస్తాం.
– ప్రసాద్, సైన్స్ టీచర్

అందరూ పాస్ కావాలి



పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నాం. సప్లిమెంటరీ పరీక్షల్లో అందరు విద్యార్థులు పాస్ అయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి.
– అశోక్, డీఈవో

'పోడు రైతులపై అధికారుల దౌర్జన్యం'

కౌటాల(సిర్పూర్): కేసీఆర్ ప్రభుత్వంలో పోడు రైతులు, గొర్రెల కాపరులపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యం చేస్తున్నారని బీజేపీ నేత పాల్వాయి హరీశ్ బాబు మండిపడ్డారు. కౌటాల మండలంలోని శీర్షా, కనికి, గురుడుపేట, యాపలగూడ, తలోడి గ్రామాల్లో మంగళవారం పల్లెపల్లెకు పాల్వాయి– గడపగడపకు బీజేపీ పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా అంబేద్కర్, కుమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరీశ్‌బాబు మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోనప్ప ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో బీజేపీ మండల అధ్యక్షుడు వానుపటేల్, ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మాజీ సర్పంచ్ గెడెం శ్యామల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న పాల్వాయి హరీశ్ బాబు

న్యూస్‌రీల్

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అంజుమ్ బానుకు వినతిపత్రం అందించారు. లోకేశ్ మాట్లాడుతూ ఆశవర్కర్లకు నిర్వహించే పరీక్షలు రద్దు చేయాలన్నారు. ప్రతినెలా 1న ఫిక్స్‌డ్ వేతనాలు చెల్లించాలని, పారితోషికం లభించని అదనపు పనులు ఆశవర్కర్లతో చేయించొద్దన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు పీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 32 రకాల రిజిస్టర్లను ప్రభుత్వమే ప్రింట్ చేసి సరఫరా చేయాలన్నారు. నాణ్యతతో కూడిన యూనిఫాంలు అందించాలని, ప్రసూతి సెలవు మంజూరు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, లావణ్య, స్వరూప తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం 53వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ హక్కుల సాధనకు కార్మికులు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1970లో సీఐటీయూ ఆవిర్భవించిందని, కార్మిక చట్టాల అమలు, కార్మిక వర్గాలను ఐక్యం చేయడంలో ఎనలేని కృషి చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టే పోరాటాలను ముందుండి నడిపిస్తుందని తెలిపారు. 52 ఏళ్ల సీఐటీయూ ప్రస్థానం ఓ ఉజ్వల ఘట్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజేందర్, సుధాకర్, తిరుపతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'పద్మశ్రీ' కనక రాజు



కలెక్టరేట్‌లో కనక రాజు

ఆసిఫాబాద్: ప్రభుత్వం తనకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు మంగళవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో ఇంటి నిర్మాణం కోసం కనక రాజుకు నివాస స్థలం, జైనూర్‌లో వ్యవసాయ భూమిని కేటాయిస్తామని తెలిపారు. అలాగే ఇతర అభివృద్ధి పనులు కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాలుగా చేయుతనందిస్తామన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు, కాలనీవాసులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని రవిచంద్రకాలనీలో నివాసముంటున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కాలనీలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న తమ కు ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు ఆత్మారాం నాయక్, మాటూరి జయరాజ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఈ నెల 28న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గుల్లకోటకు చెందిన పొన్నం అన్వేష్ (24) రెండేళ్ల క్రితం పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. కొద్దిరోజులుగా వ్యాపారం సరిగా నడవకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 28న రాత్రి సెంటర్‌లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సతీశ్

జన్నారం(ఖానాపూర్): మండలంలోని పొనకల్‌కు చెందిన గొర్కరి బానయ్య ఈ నెల 25న తన ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై సతీష్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి మంగళవారం ఫోన్ అప్పగించారు. ఎవరిదైనా ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వివరాలను సీఈఐఆర్ పోర్టల్ నమోదు చేసుకుంటే తిరిగి ఫోన్ పొందే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారు

కాగజ్‌నగర్‌రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న దేశీదారును మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దవాగు సమీపంలోని మైసమ్మ గుడి వద్ద మహారాష్ట్రకు చెందిన రెండు కార్లను ఆపి తనిఖీ చేయగా 30 దేశీదారు కాటన్‌లు లభ్యమయ్యాయన్నారు. వాటి విలువ రూ. 1.80 లక్షలు ఉంటుందన్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడ్డ కార్లను కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నామన్నారు. దేశీదారు, గుడుంబా, మత్తుపదార్థాలను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా, సిబ్బంది మధున, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో చిన్నారి మృతి



చిన్నారి మృతదేహం

కాగజ్‌నగర్‌టౌన్: విద్యుత్‌షాక్‌తో చిన్నారి మృతి చెందిన సంఘటన పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ విజయబస్తీలో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఎండి సమీర్–సానియా సుల్తానా దంపతుల కూతురు ఆశా సుల్తానా (14 నెలలు) ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటోంది. సమీపంలోనే విద్యుత్ మోటారుకు బిగించి ఉన్న పైపులైన్‌ను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన తాత నవాజ్ హుస్సేన్ ఆ చిన్నారిని లాగడంతో అతను కూడా షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిన్నారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటి వరకు ఇంట్లోనే ఆడుకున్న చిన్నారి మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని టౌన్ ఎస్సై చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ సందర్శించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుర్గానగర్‌లో చోరీ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 (దుర్గానగర్) గ్రామానికి చెందిన హర్షిత్ బిశ్వాస్ ఇంట్లో చోరీ జరిగిందని మంగళవారం ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఈనెల 26న బిశ్వాస్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి చంద్రాపూర్‌లోని తమ కూతురు ఇంటికి వెళ్లారు. మంగళవారం తమ చిన్నకుమారుడు విక్రమ్ ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో దాచిన రూ.లక్ష నగదు అపహరించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

పోదామా భామ్రాఘడ్..!

- ప్రకృతి రమణీయతకు నెలవు
- అక్కడే అరుదైన త్రివేణి సంగమం
- వందల ఏళ్లనాటి అటవీ వృక్షాలు
- చిన్నారులను అలరించే జూపార్క్



అరుదైన వృక్షాల నిలయం గ్లోరీ ఆఫ్ ఆళ్లపల్లి


చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రకృతి అందాల మధ్య కాసేపు సేదతీరాలని ఉందా?.. అరుదైన త్రివేణి సంగమాన్ని దర్శించాలని ఉందా?.. అటవీ జంతువులను దగ్గరగా పరిశీలించాలని ఉందా?.. అయితే మీరు భామ్రాఘడ్ వెళ్లాల్సిందే. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో దట్టమైన అడవుల్లో ఉన్న భామ్రాఘడ్‌లోని ఈ ప్రాంతం కుమురంభీం జిల్లాకు సమీపంలో ఉంది. చింతలమానెపల్లి మండలంలోని గూడెం ప్రాణహితనది సరిహద్దు నుండి కేవలం 75 కిలోమీటర్ల దూరంలో కాగజ్‌నగర్‌కు 110 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడికి వెళ్లాలంటే మహారాష్ట్రలోని అహేరి, ఆళ్ళపెల్లి పట్టణాల నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఆళ్లపల్లి నుంచి 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం ఒక ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. ఈ మార్గంలోని అటవీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా నిటారుగా ఆకాశాన్ని తాకినట్లు ఉండే ఎత్తైన వృక్షాలు కనిపిస్తాయి. విస్తారంగా ఉండే వందల ఏళ్లనాటి టేకు చెట్లు, అరుదైన మూలికల చెట్లు ఈ అడవుల్లో ఉన్నాయి. ఆళ్లపల్లి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే గ్లోరీ ఆఫ్ ఆళ్లపల్లి వద్ద అరుదైన వృక్షాలను పరిశీలించేందుకు ఇక్కడి ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది. ఇక్కడి చెరువు చుట్టూ సేద తీరేలా పర్యాటకులు సందర్శించేలా అభివృద్ధి చేసింది. ఇక్కడ రామ్‌లక్ష్మణ్ అనే టేకు చెట్లు వేల ఏళ్ల క్రితం నాటివని స్థానికులు పేర్కొంటున్నారు. వీటికి స్థానిక గిరిజనులు పూజలు చేస్తారు.

అరుదైన అద్భుత దృశ్యాలు

త్రివేణి సంగమాలు చాలా అరుదుగా ఉంటాయి. ఇలాంటి ఒక అరుదైన సంగమమే భామ్రాగడ్. ఇక్కడ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చే ఇంద్రావతి నది, మహారాష్ట్రలో ప్రవహించే పర్లకోట, పాముల్ గౌతమి నదులు భామ్రాగడ్ వద్ద కలుస్తాయి. ఇక్కడి సూర్యాస్తమయం మళ్లీ మళ్లీ చూడాలనిపించే అద్భుత దృశ్యం. ఇక్కడి రైతులు నదిని దాటి అవతలి వైపు వెళ్ళడానికి వినియోగించే బుల్లెట్ పడవలు (ఒకే చెట్టు కాండంతో చేసే సన్నగా ఉండే పడవలు) ఆసక్తిని కలిగిస్తాయి. ఇక్కడికి నిత్యం సందర్శకులు వస్తున్నప్పటికీ సెలవు రోజులు, శని, ఆదివారాలు, పండుగలు, పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు ఇక్కడ జరుపుకోవడానికి ఆసక్తి చూపుతారు. పర్యాటకుల కోసం అటవీశాఖ రెండు గెస్ట్ హౌస్‌లను ఏర్పాటు చేసింది. కానీ ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటేనే ఇవి లభిస్తాయి.

హెమల్‌కస.. లోక్ బిర్దరీ ప్రకల్ప్

వైద్యం అవసరమయ్యే స్థానికులకు ఈపేరు సుపరిచితం.. భామ్రాఘడ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ గ్రామంలో పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ బాబాఆమ్టె ప్రారంభించిన లోక్ బిరదారి ప్రకల్ప్ ఆశ్రమం ఉంది. దీనిని 1973లో ప్రారంభించారు. ఇక్కడ స్థానిక ఆదివాసీలు, ప్రజలకు ప్రాథమిక స్థాయిలో ఉన్నతమైన వైద్య సేవలందించేందుకు దవాఖానా, విద్యార్థులకోసం ఆశ్రమ పాఠశాల, జంతు పరిరక్షణ శాలలను ఏర్పాటు చేశారు. వైద్యం, విద్య ఇక్కడ ఉచితంగా అందిస్తారు. ఆధునిక విద్యావిధానం ద్వారా ఇచ్చే బోధన క్రీడలు, సృజనాత్మకత లాంటి అంశాలపై శిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఇక్కడి మరో ప్రత్యేకత జంతు పరిరక్షణ శాల. అటవీ ప్రాంతంలోని తప్పిపోయిన లేదా ఒంటరిగా ఉండే జంతువుల పిల్లలను సంరక్షించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. ఎన్నో అరుదైన జంతువులు ఇక్కడ ఉన్నాయి. కొండ చిలువలు, చిరుతలు, ఎలుగుబంట్లు, ముళ్ళపందులు, పక్షులు, జింకలు ఇక్కడ ఉన్నాయి. వీటి వ్యవహారాలను బాబాఆమ్టె కుమారుడు ప్రవీణ్ ఆమ్టె పర్యవేక్షిస్తారు.



భామ్రాఘడ్ త్రివేణి సంగమంలో సూర్యాస్తమయం



లోక్ బిర్‌దరీ ప్రకల్ప్ జంతుశాల వద్ద ఔత్సాహికులు

'కార్మికులను నట్టేట ముంచిన జాతీయ సంఘాలు'



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): వేతన ఒప్పందంలో ఎలాంటి పెరుగుదల సాధించకుండా బొగ్గుగని కార్మికులను జాతీయ సంఘాలు నట్టేటా ముంచాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం గోలేటి సీహెచ్‌పీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేజ్‌బోర్డులో ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్ తప్పుడు ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. అలవెన్సులను జూన్ 2023 నుండి చెల్లించేలా ఒప్పందం చేసుకోవటంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. గృహ రుణం, పెన్షన్, కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలేవీ చర్చల్లో లేకుండా పోయాయన్నారు. జాతీయ సంఘాలు చేసే అవాస్తవ ప్రచారాన్ని అడ్డుకుని వాస్తవాన్ని గ్రహించాలని కార్మికులను కోరారు. సమావేశంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, నాయకులు రాయలింగు, సదాశివ్, సమ్మయ్య, వీరస్వామి, సంపత్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు



జెండా ఆవిష్కరిస్తున్న ఓదెలు

రెబ్బెన(ఆసిఫాబాద్): హక్కుల సాధన కోసం కార్మికులంతా సంఘటితంగా పోరాడాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు అన్నారు. మంగళవారం రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణ, గోలేటి టౌన్‌షిప్‌లో సీఐటీయూ 53వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లో సీఐటీయూ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు కార్మికుల వెన్నంటే ఉంటూ వారి న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు సాగిస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం సీఐటీయూ అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి దేవాజీ, నాయకులు సత్తయ్య, లోకేష్, శంకర్, నర్సయ్య, ప్రవీణ్, శేఖర్, కార్మికులు చంద్రశేఖర్, చిన్నుబాయి, లక్ష్మి, శారద, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన రక్షణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 2015 నుంచి 2022 వరకు జరిగిన ప్రమాదాల అనుభవాల మేరకు ఏటా జూన్‌లో అధిక మరణాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్ రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఏవీరెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదిర్, రక్షణ అధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, ఇంజనీర్ సందీప్ పాల్గొన్నారు.

5న సింగరేణి సంబురాలు

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్రంలో సింగరేణి సాధించిన ప్రగతిపై ప్రతి ఉద్యోగి తెలుసుకునేలా జూన్ 5న సింగరేణి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అన్ని గనులు, విభాగాల ముఖ్య అధికారులు, గుర్తింపు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం గోపాల్ సింగ్, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు కే.సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్, ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, డీజీఎంలు అరవింద్‌రావు, చిరంజీవి, శివరావు, డీ.వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలపై వీడియో కాన్ఫరెన్స్

శ్రీరాంపూర్: సింగరేణిలో జూన్ 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలపై కంపెనీ డైరెక్టర్లు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. డైరెక్టర్లు ఎస్.బలరాం, ఎన్‌వీకే శ్రీనివాస్, జీ.వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ప్రగతి మైదానంలో నిర్వహించే వేడుకల వివరాలను వెల్లడించారు.

పీవైఎల్ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర ద్వితీయ మహాసభలను జూన్ 5, 6 తేదీలలో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు పీవైఎల్ డివిజన్ కార్యదర్శి ఎగుడ సాయికిరణ్ తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతతో ఆటలాడుకుంటున్నాయన్నారు.కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు మోర్ల సాయిరామ్, శంకర్, రాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు గోపీనాథ్, చెన్నూర్ డివిజన్ అధ్యక్షుడు మాసాని రమేశ్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నార్లాపూర్‌లో ఈ నెల 27న ముంజంపల్లి పోశం హత్యకేసులో నిందితుడు సురేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ముంజంపల్లి సురేష్ భార్యతో అతని బాబాయి పోశం అసభ్యకరంగా ప్రవర్తించాడని రోడ్డుపై నుంచి కర్రతో బాదుకుంటూ ఇంటికి లాక్కెళ్లి తలను పందిరి గుంజకు కొట్టడంతో మృతి చెందాడు. మృతుని సోదరి తారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలిస్తుండగా మంగళవారం లొంగిపోయాడన్నారు. హత్యకు వినియోగించిన కర్రను స్వాధీనం చేసుకుని, నిందితున్ని కోర్టులో హాజరు పర్చనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డైరెక్టర్ బలరాం

బెల్లంపల్లి/రెబ్బెన: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి సమాలోచనలు చేస్తున్నామని సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరాంనాయక్ అన్నారు. మంగళవారం ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, మేల్, ఫిమేల్ వార్డులు, అత్యవసర చికిత్స విభాగం పరిశీలించారు. జూన్ 2లోగా గైనిక్ వార్డును ప్రారంభించాలని ఇన్‌చార్జి వైద్యాధికారిని ఆదేశించారు. విధులకు ఆలస్యంగా వచ్చిన 15 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు పంపించాలని సూచించారు. మరో ఉద్యోగి ఆసుపత్రికి వచ్చి బయటకు వెళ్లగా సదరు ఉద్యోగిని సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ డాక్టర్, కొందరు సిబ్బంది రోగుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలుసుకుని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తిలక్ స్టేడియం, బుధాగెస్ట్ హౌజ్‌ను సందర్శించారు. బీపీఏ జీఎం దేవేందర్, ఏరియా ఆసుపత్రి ఇంచార్జి డీవైసీఎంఓ రాజేశ్వరరావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఆసుపత్రి పిట్ సెక్రెటరీ అనుముల సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియం పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌వోటూ జీఎం గుప్తా, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

జైపూర్: సింగరేణి వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని సింగరేణి డైరెక్టర్ ఎస్.బలరాం తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును మంగళవారం ఆయన సందర్శించారు. సింగరేణి సంబరాలు, దశాబ్ది ఉత్సవాలపై ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం సూర్యనారాయణరాజు, ఏజీఎం సుధాకర్, సత్యనారాయణప్రసాద్, శ్రీనివాసులు, డీజీఎం పర్సనల్ కేసా నారాయణరావు, అధికారులు రామశాస్త్రి, పంతులా, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినయ్ ఆత్మహత్యకు కారకులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న వినయ్ కుటుంబ సభ్యులు

మంచిర్యాలక్రైం: దండేపల్లి మండలం కొత్తమామిడిపెల్లి గ్రామానికి చెందిన నలిమెల వినయ్ ఆత్మహత్యకు కారకులను అరెస్టు చేయాలని కోరుతూ మృతుని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మంగళవారం డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు వినయ్‌పై అక్రమంగా కేసులు పెట్టి వేధించడవల్లే ఈ నెల 15న ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఆత్మహత్యకు కారకులైనవారితో మాకు ప్రాణ భయం ఉందని దండేపల్లి పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో ఎంబడి రాజమణి, ఎంబడి రాజలింగు, ఎంబడి నర్సయ్య, ఎంబడి నిశ్వాంత్, చుంచు శ్రీనివాస్, చుంచు సునీత, ఎంబడి వెంకటేష్, నలిమెల మహేష్, పత్తిపాక సంతోష్‌లపై కేసులు నమోదు చేసినా వారిని అరెస్ట్ చేయకపోవడంతో డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వినయ్ మృతికి కారణమైన వారిన అరెస్ట్ చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఓవరాల్ చాంపియన్‌షిప్




అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లో జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు గోల్డ్‌మెడల్, అథ్లెటిక్స్‌లో జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన బి. కార్తీక్ 400 మీటర్ల పరుగుపందెంలో, లాంగ్‌జంప్‌లో కె.ప్రణయ్ గోల్డ్‌మెడల్ సాధించడంతో జిల్లాకు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. శివాజీ చౌరాస్తా నుంచి ఖర్జెల్లి వెళ్ళే దారిలో తీగలు వేలాడుతున్నాయని స్థానికులు సమాచారం అందించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల వీచిన గాలులకు తీగ మరింతగా కిందికి జారి ఈమార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తగలడంతో తెగి కింద పడింది. ఆసమయంలో విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రమాదం తప్పింది.



తెగి పడిన విద్యుత్ తీగ

'కవ్వాల్'లో ట్రెయినీ అధికారుల పర్యటన



వివరాలు తెలియజేస్తున్న ఎఫ్‌డీవో

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో మంగళవారం ట్రెయినీ సెక్షన్ అధికారులు పర్యటించారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 16 మంది శిక్షణ అధికారులు సోమవారం రాత్రి జన్నారం చేరుకున్నారు. వారికి ఘనిశెట్టి కుంట వద్ద డేరాలు వేసి బస ఏర్పాటు చేశారు. మంగళవారం జన్నారం, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌ల లోని పలు ప్రాంతాల్లో పర్యటించి నీటి కుంటలు, గడ్డి మైదానాలు, బేస్‌క్యాంపులు పరిశీలించారు. వారి వెంట ఎఫ్‌డీవో మాధవరావు, రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.

'గురుకులం'లో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక



ఎంపికైన పొనకల్ పాఠశాల విద్యార్థులు

జన్నారం(ఖానాపూర్): మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఐదోతరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 30న నిర్వహించిన పరీక్షలో జన్నారం విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 29న వెలువడిన ఫలితాల్లో జన్నారం మండలం కలమడుగు వివేకానంద పాఠశాలకు చెందిన 15 మంది, పొనకల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. పొనకల్ పాఠశాల హెచ్‌ఎం జాజుల శ్రీనివాస్, వివేకానంద పాఠశాల హెచ్‌ఎం సతీశ్‌గౌడ్, ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఎంఈవో విజయ్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అభినందించారు.

'చలో కొత్తగూడెం'కు ప్రత్యేక రైలు

శ్రీరాంపూర్(మంచిర్యాల): జూన్ 4న తలపెట్టిన చలో కొత్తగూడెం కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్మికులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలివచ్చేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు తెలిపారు. మంగళవారం నస్పూర్‌లోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న సాయంత్రం కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి ఉదయం 8 గంటలకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేశామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మహేష్, రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, తోట శ్రీనివాస్, లచ్చన్న పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన సురేఖ (40) ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కొన్నేళ్లుగా సురేఖ కడుపునొప్పితో బాధపడుతోంది. మందులు వాడినా నయంకాకపోవడంతో మనస్తాపం చెందింది. మంగళవారం ఇంట్లోనే సూపర్‌వాస్మల్ తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త గోవర్ధన్, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.